క్లుప్తంగా

నేడు 'జగనన్నకు చెబుదాం'

కేవీబీపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, జాయింట్ కలెక్టర్ బాలాజి, ఆర్డీఓ రవి హాజరవుతారని, ప్రజలు సమస్యలను నివేదించి పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

2 నుంచి బాలాలయం

నాగలాపురం: శ్రీ వేదనారాయణస్వామి ఆలయంలో డిసెంబర్ 2 నుంచి 7 వ తేదీ వరకు బాలాలయం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్టు ఆలయ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఆరు రోజుల పాటు రోజువారీ శాస్త్రోక్తంగా నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలను ఆయన వివరించారు.

సరిహద్దు రాళ్ల పునఃప్రతిష్ట


సరిహద్దు రాళ్లకు పూజలు చేస్తున్న అంజూరు

శ్రీకాళహస్తి: పట్టణంలో ఏడుగంగల జాతరను పురస్కరించుకుని పట్టణ సరిహద్దు తెలిపేలా పెండ్లిమండపం పొన్నాలమ్మ, బాబుఅగ్రహారం అంకమ్మ తెట్టు రాళ్లను గురువారం శాస్త్రోక్తంగా పునఃప్రతిష్ట చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ డిసెంబరు 5, 6 తేదీల్లో శ్రీకాళహస్తిలో ఏడు గంగల జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు.

నైపుణ్యాలను వెలికితీయాలి

సత్యవేడు: ఉపాధ్యాయులు విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీసేందుకు కృషి చేయాలని ఎంఈఓ కే.రవి అన్నారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ స్థాయి శిక్షణా కార్యక్రమాలను ఎంఈఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు బోధనలో మెలకువలపై దృష్టి సారించడంతో పాటు నూతన సాంకేతిక పద్ధతులపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భారతి, కే.లలిత, రిసోర్స్ పర్సన్లు ఓ. త్యాగరాజు, మంజుల, చెంచుకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

శుభ్రతపై అవగాహన

ఏర్పేడు: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ మోహనప్రియ తెలిపారు. మండలంలోని ఎండీపుత్తూరు పంచాయతీలో గురువారం రోడ్లపై నిల్వ ఉన్న వర్షపు నీటిని కాలువల ద్వారా తొలగించి, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చేతి పంపుల వద్ద నీరు నిల్వలేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా!

- రేణిగుంటలో 'మన వద్దకే - మన ఎమ్మెల్యే' కార్యక్రమం
- సమస్యలు తెలుసుకుని పరిష్కరించిన బియ్యపు మధుసూదన్‌రెడ్డి


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: ఎమ్మెల్యే పదవి మీరు పెట్టిన భిక్ష.. నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ గెలిచిన నాటి నుంచి నిత్యం ప్రజల మధ్యనే తిరుగుతూ ప్రజల కష్ట, సుఖాల్లో తోడుగా ఉన్నానని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గుర్తు చేశారు. రేణిగుంట పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఆయన 'మన వద్దకే- మన ఎమ్మెల్యే'కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని ఆయా శాఖల అధికారులకు ఇచ్చి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో అర్జీలు రాసుకొచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. అందరి సమస్యలు సావధానంగా విని పరిష్కారానికి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం అయన మాట్లాడుతూ రేణిగుంట మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆ తర్వాత ఇంకా ఏవైనా సమస్యలు మిగిలిపోయి ఉంటే ప్రజల నుంచి వాటిని తీసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, మండల పార్టీ అధ్యక్షుడు గంగారి రమేష్, వైస్ ఎంపీపీ సుజాత, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, జువ్వల దయాకర్‌రెడ్డి, యోగేశ్వరరెడ్డి, రసూల్, మన్యం శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ ఆనందరావు, మాజీ ఎంపీటీసీ నాగరాజు, ఎంజీ రాజేష్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల వినతి

ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు అంగన్‌వాడీ కార్యకర్తలు విన్నవించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రం, సమ్మె నోటీసును అందజేశారు. డిసెంబర్ 8వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేయనున్నట్లు తెలిపారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధనమ్మ, రాధమ్మ, కవిత, ప్రభ, విజయలక్ష్మి, అంబిక పాల్గొన్నారు.

ఆక్రమణకు పాల్పడితే చర్యలు

వరదయ్యపాళెం: రోడ్డు మార్గంలో ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గౌరిశంకరరావు, ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాసులు హెచ్చరించారు. కరుణానది పాత రోడ్డు వద్ద రెవెన్యూ, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు గురువారం సంయుక్తంగా సర్వే చేశారు. కోర్టు ఉత్తర్వుల మేరకు తడ-వరదయ్యపాళెం మార్గంలోని కరుణానది వద్ద లోలెవల్ కాజ్‌వేపై ఆర్ అండ్‌బీ శ్రీకాళహస్తి డివిజన్ డీఈ, తహసీల్దార్, సర్వేయర్ రమణ సర్వే చేశారు. రోడ్డును ఆక్రమించి వేసుకున్న గడ్డివాములు తొలగించాలని ఆదేశించారు. అర్అండ్‌బీ ఏఈ గిరీష్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై వివక్ష నేరం


మాట్లాడుతున్న ఆర్ఐ వెంకటసుబ్బయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: ఎస్సీ, ఎస్టీలపై ఇతర కులాల వారు కుల వివక్ష చూపితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆర్ఐ వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. గురువారం మండలంలోని వీయస్‌పురం గ్రామ ఎస్టీ కాలనీలో సర్పంచ్ సిద్ధమ్మ అధ్యక్షతన సామాజిక న్యాయంపై రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారుల ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్ఐ మాట్లాడుతూ, అగ్రవర్ణాల వారు ఎస్సీ, ఎస్టీలను చిన్న చూపు చూడరాదన్నారు. ఎవరైనా వివక్షకు గురైన పక్షంలో తమ దృష్టికి తేవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మణి నాయుడు, వీఆర్ఓ భాస్కర్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి రజనీకాంత్ పాల్గొన్నారు.

జగనన్నతోనే ప్రతి కుటుంబం అభివృద్ధి


సత్యవేడు: బోర్డు ఆవిష్కరిస్తున్న సుశీల్ కుమార్‌రెడ్డి

సత్యవేడు: జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటేనే ప్రతి కుటుంబం సంక్షేమ పథకాలతో అభివృద్ధి చెందుతుందని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి అన్నారు. సత్యవేడు సచివాలయం-1లో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పథకాల లబ్ధి డిజిటల్ బోర్డును ఆవిష్కరించి ఆయన మాట్లాడారు.

సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

వరదయ్యపాళెం: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సీఎం వైఎస్‌జగన్‌తోనే సాధ్యం అని జేసీఎస్ కన్వీనర్ చిన్నా అన్నారు. వరదయ్య పాళెం సచివాలయం-2లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బోర్డును ఆవిష్కరించి మాట్లాడారు.

బుచ్చినాయుడుకండ్రిగ: సంక్షేమ సారథి జగనన్న మరోసారి గెలిపించుకోవాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి కోరారు. గురువారం మండలంలోని ఆర్.అనంతాపురం గ్రామ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను, సంక్షేమం, అభివృద్ధి డిజిటల్ బోర్డును ఆవిష్కరించి మాట్లాడారు.

అనుమతి ఇవ్వలేదనే ఆరోపణలు

సత్యవేడు: దాసుకుప్పం పంచాయతీలో చెన్నైలోని ఆర్.శ్రీనివాసన్‌కు చెందిన లేఅవుట్‌కు పంచాయతీ అనుమతి ఇవ్వలేదనే కారణంతో తనపై తప్పుడు ఆరోపణలు చేశారని నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏ. రవిరెడ్డి తెలిపారు. ఆయన గురువారం స్థానిక సర్పంచులతో కలసి మీడియాతో మాట్లాడారు. దాసుకుప్పంలో ఆయన కొనుగోలు చేసిన 2.5 ఎకరాల భూమిలో పంచాయతీ, తుడా అనుమతి లేకుండా నూతన లేఅవుట్లు వేయకూడదని చెప్పానన్నారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి నోటీసులు ఇచ్చినట్టు చెప్పారు. దీంతో తనపై కక్ష సాధించడానికి కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేయించాడని, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ఆరోపణలు చేయించారని చెప్పారు. సమావేశంలో సర్పంచులు హెచ్.గోవిందస్వామి, రూబెన్, శ్రీరాములు రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి మాజీ సర్పంచ్ గోవిందస్వామి పాల్గొన్నారు.

భారీ వర్షం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో గురువారం ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. 21 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆలత్తూరు, కొత్తకండ్రిగ, చిన్నయగుంట, పూసలపల్లె, ఆర్.అనంతాపురం గ్రామాల రోడ్లు రొచ్చురొచ్చుగా మారాయి. వరి రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమయ్యారు. చెరుకు, మామిడి రైతులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక జెడ్పీ హైస్కూలులో వంట గదిలోకి వర్షపు నీరు చేరడంతో వంట నిర్వాహకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు హెచ్ఎం రమణయ్య చర్యలు తీసుకోవడంతో ఆ తర్వాత వంటావార్పు చేసి విద్యార్థులకు వడ్డించారు.

కలెక్టర్ దృష్టికి సమస్యలు


కలెక్టర్‌కు విన్నవిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలోని పలు సమస్యలను జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి దృష్టికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నివేదించారు. గురువారం కలెక్టర్‌ను తిరుపతిలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతుల నిమిత్తం నిధులు కేటాయించాలని కోరారు. పిచ్చాటూరు మండలంలోని ఎస్ఎస్‌బి పేటలో ఉన్న 105 ఎకరాల ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని కోరారు. వేలూరు దళితవాడ సమీపంలో ఉన్న మేతబీడు, గ్రామకంఠం భూములను దళితులకు పట్టాలు ఇవ్వాలన్నారు. వరదయ్యపాలెంలో పెండింగ్‌లో ఉన్న ఇంటి పట్టాల సమస్యలు పరిష్కరించి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలన్నారు. అలాగే నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలని ఎమ్మెల్యే కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.